గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ ప్రావీణ్య

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య, చిత్రంలో సీపీ అంబర్ కిశోర్ ఝా, కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

హనుమకొండ, సెప్టెంబర్ 4: గణేశ్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో గణేశ్ ఉత్సవాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నిమజ్జనం ప్రాంతంలో సీనియర్ జిల్లా అధికారితోపాటు మరో అధికారిని నియమిస్తున్నట్లు తెలిపారు. నిమజ్జన శోభాయాత్రపై మండపాల నిర్వాహకులు ముందస్తు సమాచారం అందించాలన్నారు. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ ట్రాఫిక్‌కు ఎక్కడ ఇబ్బందులు రాకుండా ఉత్సవాల నిర్వహణకు కృషి చేయాలన్నారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లా పరిధిలో సాగునీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో 8 చెరువులు, మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో 14 చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆ శాఖల అధికారులు వెల్లడించారు. పరకాలలో ఐదు నిమజ్జన పాయింట్లు ఉన్నాయన్నారు. గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని విద్యుత్‌శాఖ అధికారులు వెల్లడించారు. నిమజ్జన ప్రాంతాల వద్ద వైద్య ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేస్తామని డీఎంహెచ్‌వో లలితాదేవి తెలిపారు. బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌వో వైవీ గణేశ్, ఆర్‌డీవోలు వెంకటేశ్, నారాయణ పాల్గొన్నారు.

భవన యజమానులే మరమ్మతులు చేయించాలి

అద్దె భవనాల్లో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఆయా భవనాల యాజమానులే మరమ్మతులు చేయించి సౌకర్యాలు మెరుగ్గా ఉండేలా చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లో ప్రిన్సిపాల్స్, అద్దెభవనాల యజమానులతో సమావేశం నిర్వహించారు. సొంత భవనాలు, అద్దె భవనాల్లో కొనసాగుతున్న వాటిలో విద్యార్థుల సంఖ్య, తరగతి గదులు, వాటర్, విద్యుత్, డ్రైనేజీ సౌకర్యాలపై ప్రిన్సిపాల్స్‌ను అడిగి తెలుసుకున్నారు. కాంపౌండ్ వాల్, భవనాలకు గ్రిల్స్ తప్పక ఉండాలన్నారు. హసన్‌పర్తి డిగ్రీ కళాశాలతోపాటు ఇతర పాఠశాలలు, కళాశాలల్లో నెల రోజుల్లోగా మరమ్మతులను పూర్తి చేయాలని ఆదేశించారు. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ మల్టీ జోనల్ ఆఫీసర్ అలివేలు, జిల్లా సమన్వయ అధికారి ఉమా మహేశ్వరి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్

తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన మట్టి గణేశ్ విగ్రహాల పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. చెరువుల స్వచ్ఛతను కాపాడేందుకు భక్తులు నడుంబిగించాలని, మట్టి విగ్రహాలనే వినియోగించాలని కోరారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రతి జిల్లాకు 2వేల మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి జిల్లా అధికారి సునీత పాల్గొన్నారు.

26న డాక్ అదాలత్

హనుమకొండ, సెప్టెంబర్ 4 : ఈ నెల 26న తపాలా పోస్టల్ సర్వీసెస్‌కు సంబంధించిన విషయాలపై హైదరాబాద్ రీజియన్ ప్రాంతీయ స్థాయి 47వ డాక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు హనుమకొండ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11గంటల నుంచి గూగుల్ మీట్ ద్వారా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తారన్నారు. లింకును ఫిర్యాదుదారుడి మొబైల్ నంబర్ లేదా ఈమెయిల్ అడ్రస్‌కు పంపిస్తామని, ఫిర్యాదులో మొబైల్ నంబర్, ఈమెయిల్ ఐడీ తప్పకుండా తెలుపాలన్నారు. వరంగల్, హనుమకొండ, ములుగు, భూపాలపల్లి, జనగామ జిల్లాల ప్రజలు పోస్టల్ సర్వీసెస్‌కు సంబంధించిన ఫిర్యాదులను ఈ నెల 11వ తేదీలోగా కే శ్రీకాంత్ అసిస్టెంట్ డైరెక్టర్ (స్టాఫ్ అండ్ విజిలెన్స్), ద పోస్ట్ మాస్టర్ జనరల్, హైదరాబాద్ రీజియన్, హైదరాబాద్–500001 చేరేలా పంపించాలన్నారు. ఎన్వలప్, కవర్‌పై తప్పకుండా 47వ డాక్ అదాలత్ అని రాయాలని పేర్కొన్నారు.

గద్దర్ అవార్డు అందుకుంటున్న భిక్షపతి

భిక్షపతికి గద్దర్ అవార్డు

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 4 : కవి, గాయకుడు, రచయిత, హనుమకొండ మ్యూజిక్ అధినేత హనుమకొండ భిక్షపతి గద్దర్ అవార్డు అందుకున్నారు. తొర్రూరు పట్టణంలో ప్రజాగాయకుడు గిద్దె రాంనర్సయ్య చేపట్టిన గిద్దెగళం ఆధ్వర్యంలో గద్దర్ అన్న అవార్డు కార్యక్రమం నిర్వహించారు. ప్రజాయుద్ధనౌక గద్దర్ కూతురు వెన్నెల, ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కాశీం, తెలంగాణ క్రాంతి దళ్ అధ్యక్షుడు సింగంరెడ్డి పృథ్వీరాజ్, దరువు అంజన్న, శంభూకుని అవార్డు గ్రహీత శరత్‌చమర్, తాళ్ల సునీల్, యోచన జూపాక శివ చేతుల మీదుగా గద్దర్ అవార్డును భిక్షపతి అందుకున్నాడు. కార్యక్రమంలో నరేశ్, డప్పు శ్రీకాంత్, రాజేందర్ పాల్గొన్నారు.

కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ రామేశ్వరం విరాళం

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 4 : కేయూ ప్రభుత్వ పాలన, మానవ వనరుల విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ గజ్జెల రామేశ్వరం ప్రభుత్వ పాలనా విభాగం విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రీనివాసరావుకు రూ.20వేలు విరాళం అందజేశారు. డిజిటల్ లైబ్రరీ, సీసీ కెమెరాల ఏర్పాటు,ర్యాంపుల నిర్మాణం, పరిశోధక విద్యార్థులకు విస్తృత ఉపన్యాసాలు, పచ్చదనం పరిశుభ్రత వంటి కార్యక్రమాల నిర్వహణ ద్వారా విభాగం అభివృద్ధికి కృషి చేస్తున్నారని శ్రీనివాసరావును కొనియాడారు. ప్రభుత్వ పాలనా విభాగం సీనియర్ ప్రొఫెసర్, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ తోపుచర్ల యాదగిరిరావు, అధ్యాపకులు ఆకుతోట శ్రీనివాసులు, చీకటి శ్రీను, బుర్రి ఉమాశంకర్, మోహన్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-318996

WANTED

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం, జీతం 16 K to 18K, ఏజెంట్ కమిషన్ 6K Ph: 9640258899/9640468899.
NT-331758

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

బల్దియా రూటే సపరేటు

స్మార్ట్‌రోడ్డు వేసిన నెల రోజులకే తవ్వకాలు.. లక్షల రూపాయలు రోడ్డు పాలు

కరీమాబాద్, సెప్టెంబర్ 4: అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని శాంతినగర్ ఆర్వోబీ నుంచి రంగశాయిపేట వరకు ప్రభుత్వం స్మార్ట్ రోడ్డు నిర్మిస్తున్నది. అది సగం వరకు కూడా పూర్తి కాలేదు. ఈ నేపథ్యంలో ఉర్సు చెట్లవారిగడ్డ వద్ద పైపులైన్ మరమ్మతుల పేరుతో జీడబ్ల్యూఎంసీ సిబ్బంది రోడ్డును తవ్వారు. సగం వేసిన రహదారితో నెలలుగా ఇబ్బంది పడుతున్నామని స్థానికులు అంటున్నారు. ఈ క్రమంలో ఉన్న రోడ్డును కాస్త తవ్వడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల సమన్వయ లోపంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అవుతున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉర్సు చెట్లవారిగడ్డ సెంటర్ వద్ద బల్దియా సిబ్బంది తవ్విన రోడ్డు

కాంస్యం సాధించిన దీప్తికి అభినందనలు

దీప్తి, నాగపురి రమేశ్‌ను అభినందిస్తున్న పారా స్పోర్ట్స్ తెలంగాణ అసోసియేషన్ సభ్యులు

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 4 : పారిస్ పారాలింపిక్స్ టీ–20 విభాగం 400 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించిన జీవంజీ దీప్తికి పారా స్పోర్ట్స్ తెలంగాణ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముత్తినేని వీరయ్య, అధ్యక్షుడు సింగారపు బాబు, జనరల్ సెక్రెటరీ ప్రశాంత్ అభినందనలు తెలిపారు. ఆమె విజయానికి తోడ్పాటు అందించిన ద్రోణాచారి అవార్డు గ్రహీత నాగపురి రమేశ్‌కు అభినందనలు చెప్పారు.

దెబ్బ తిన్న పెద్ద చెరువు మత్తడికి మరమ్మతులు

ఎక్స్‌కవేటర్‌తో మట్టి పోయిస్తున్న ఎంపీడీవో

కమలాపూర్, సెప్టెంబర్ 4 : మండల కేంద్రంలో వర్షాలకు చెరువులు నిండి అలుగు పోస్తున్నాయి. కమలాపూర్ పెద్ద చెరువు మత్తడి కూలిపోవడంతో అలుగుపోసేందుకు సిద్ధంగా ఉంది. మత్తడి వద్ద కోతకు గురయ్యే అవకాశం ఉండడంతో ఎంపీడీవో బాబు, నీటిపారుదల శాఖ ఏఈ అనిల్ ఎక్స్‌కవేటర్‌తో బండలు, మట్టి పోసి నింపారు. వేసవిలో మత్తడి వద్ద ఎక్స్‌కవేటర్ల యజమానులు మట్టి తరలించడంతో పెద్ద గుంత ఏర్పడింది. పెద్ద చెరువులోకి వరద వస్తుండడంతో అలుగు దూకేందుకు సిద్ధంగా ఉంది. మత్తడి కూలే ప్రమాదం ఉండడంతో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని ఎంపీడీవో సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ అభియాన్

భీమదేవరపల్లి, సెప్టెంబర్ 4 : మండలంలోని భీమదేవరపల్లి, మాణిక్యాపూర్‌లో బుధవారం పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వంగర ప్రభుత్వ వైద్యాధికారులు రహమాన్, రుబీనా మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన పోషకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఆత్మకూరు మున్సిపాలిటీ కోసం ప్రతిపాదనలు

జాబితా తయారు చేస్తున్న అధికారులు

ఆత్మకూరు గ్రామ ముఖ చిత్రం

ఆత్మకూరు, సెప్టెంబర్ 4 : ఆత్మకూరును మున్సిపాలిటీ చేసేందుకు అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. ఆత్మకూరు, కామారం, గూడెప్పాడ్, తిరుమలగిరి, నీరుకుళ్ల, పెంచికల్‌పేట, వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం కేశవపురం గ్రామాన్ని కలిపి మున్సిపాలిటీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. 2024 జనాభా లెక్కల ప్రకారం ఆత్మకూరులో 8,210 మంది, కామారంలో 1,170 మంది, తిరుమలగిరిలో 510, గూడెప్పాడ్‌లో 1,913, నీరుకుళ్లలో 4,225 , పెంచికల్‌పేటలో 2,879, కేశవపురంలో 620 మంది, 7 గ్రామాల్లో మొత్తం 18,140 జనాభా ఉన్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దుగ్గొండి మండలం కేశవపురం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి స్వగ్రామం కావడం వల్ల మున్సిపాలిటీ కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలోనే అప్పటి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆత్మకూరును మున్సిపాలిటీగా చేస్తానని చెప్పగా, ఆ కళ నెరవేరబోతున్నదని మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్తంభాలను సరిచేసిన అధికారులు

'నమస్తే' కథనానికి స్పందన

శాయంపేట, సెప్టెంబర్ 4 : మండల పరిధిలోని ఆరెపల్లి గ్రామ శివారులో పొలాల్లో వంగిపోయి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను అధికారులు బుధవారం సరిచేయించారు. గత నెల 17న 'పొలాల్లో ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు' శీర్షికన నమస్తే తెలంగాణలో కథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్ అధికారులు ఆరెపల్లి నుంచి ఆత్మకూరు పరిధిలో ఉన్న వంగిపోయిన స్తంభాలు, కిందకు వేలాడుతున్న తీగెలను సరిచేశారు. ఏఈ రవికుమార్, లైన్‌మెన్ రవి ఉన్నారు.

తగ్గని వరద ఉధృతి.. నిలిచిన బస్సులు

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 4 : భారీ వర్షాలకు ఇంకా వరద ఉధృతి కొనసాతుండడంతో ఆయా రూట్లలో బస్సులను నిలిపివేసినట్లు ఆర్‌ఎం విజయభాను తెలిపారు. విజయవాడ, వైజాగ్, భద్రాచలం రూట్లలో బండారుపల్లి, ములుగులో రోడ్ల మరమ్మతుల కారణంగా బస్సుల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందన్నారు. కేసముద్రం వద్ద వరద ఎక్కువగా ఉండడం, బుధవారం కూడా వర్షం పడడంతో మహమూబాబాద్‌లోని కొన్ని రూట్లలో బస్సులను నిలిపివేసినట్లు, మహబూబాబాద్–ఇల్లందు మధ్య నామాలపాడు గ్రామం వద్ద వరద ఉధృతి వల్ల అటువైపు ఆరు బస్సులను నిలిపివేసినట్లు చెప్పారు. తొర్రూరు–హైదరాబాద్ రూట్లలో హెవీలోడ్‌తో ఉన్న లారీలు వెళ్లడంతో బస్సు దిగబడిందని, వరంగల్ రీజియన్‌లో 50 బస్సులు రద్దు చేయడంతో రూ.20 లక్షల వరకు ఆర్టీసీ ఆదాయం కోల్పోయిందని ఆర్‌ఎం తెలిపారు.

విద్యుత్ ఎస్ఈలు అప్రమత్తంగా ఉండాలి

టీజీ ఎన్పీడీసీఎల్ కర్నాటి వరుణ్‌రెడ్డి

హనుమకొండ, సెప్టెంబర్ 4 : ఈనెల 4వ తేదీ నుంచి 9వ తేదీ వరకు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనాల నేపథ్యంలో టీజీ ఎన్పీడీసీఎల్ 16 సర్కిళ్ల ఎస్ఈలు అప్రమత్తంగా ఉండాలని సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశించారు. హెడ్ క్వార్టర్‌లోనే ఉంటూ ప్రతి గంటకొకసారి విద్యుత్ సరఫరా స్థితిని పరిశీలించాలని సూచించారు. 24/7 పనిచేసేటట్లు కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోల్స్, సామగ్రి, కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగులు, సిబ్బందికి సెలవులు రద్దు చేశామని, అత్యవసరంగా సెలవు కావాలంటే సీఈకి సమాచారం ఇవ్వాలని సూచించారు. కాగా, భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్‌పై వినియోగదారులు చాలా జాగ్రత్తగా ఉండాలని హనుమకొండ సర్కిల్ ఎస్ఈ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి సంబంధించిన సమస్యలు ఉంటే 1912, 18004250028 నంబర్లకు కాల్ చేయాలని పేర్కొన్నారు.

మాజీ కార్పొరేటర్ విద్యాసాగర్ భార్య మృతి

నీరజ (ఫైల్)

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 4 : హనుమకొండ కొత్తూరు జెండాకు చెందిన మాజీ కార్పొరేటర్ తాడిశెట్టి విద్యాసాగర్ భార్య నీరజ అనారోగ్యంతో మృతిచెందింది. కిడ్నీ సమస్యలతో బాధపడుతుండగా వైద్యులు మూడేళ్ల క్రితం కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశారు. ఇటీవల కిడ్నీలకు ఇన్ఫెక్షన్ కావడంతో హైదరాబాద్‌లోని అపోలో హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. ఆమెకు ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. విదేశాల్లో ఉన్న చిన్నకొడుకు, కూతురు కోసం కుటుంబ సభ్యులు వేచిచూస్తున్నారు.

వేయిస్తంభాల గుడిలో 7 నుంచి 16 వరకు గణపతి నవరాత్రోత్సవాలు

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా సహాయ కమిషనర్ సునీత, ఈవో వెంకటయ్య, గంగు ఉపేంద్రశర్మ

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 4 : చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో ఈనెల 7 నుంచి 16వ తేదీ వరకు జరిగే గణపతి నవరాత్రి ఉత్సవాల కరపత్రాలను ఆలయ కార్యనిర్వాహణాధికారి వెంకటయ్య ఆధ్వర్యంలో జిల్లా సహాయ కమిషనర్ రామాల సునీత, ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆవిష్కరించారు. గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ ఆలయంలో 75 ఏళ్లుగా గణపతి ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉత్సవ ఆహ్వాన సభ్యులు గండ్రాతి రాజు, కాశీలింగాచారి, అర్చకుడు ప్రణవ్, సిబ్బంది మధుకర్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆత్మకూరు : ఇప్పలకుంట వరదతో మునిగిన పొలాలు

దామెర : పసరగొండలో నీటమునిగిన వరి

దామెర : పసరగొండలో ఇండ్లలోకి వర్షపు నీరు

భీమదేవరపల్లి : ముల్కనూరులో వర్షాలకు కూలిన ఇల్లు

జిల్లాలో మోస్తరు వర్షం

- 28.7 మిల్లీమీటర్ల సరాసరి నమోదు
- అత్యధికంగా భీమదేవరపల్లి మండలంలో 55.3, అత్యల్పంగా హనుమకొండలో 10.2 మిల్లీమీటర్లు
- పలుచోట్ల మత్తడి దుంకుతున్న కుంటలు, చెరువులు
- పరకాల డివిజన్‌లో పంటపొలాలు మునక

హనుమకొండ/ పరకాల/ ఆత్మకూరు/ దామెర/ భీమదేవరపల్లి/ శాయంపేట, సెప్టెంబర్ 4 : హనుమకొండ జిల్లాలో బుధవారం వరకు 28.7మిల్లీమీటర్ల సరాసరి వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. భీమదేవరపల్లి మండలంలో 55.3 మిల్లీమీటర్లు, హనుమకొండ 10.2, వేలేరు 30, ఎల్కతుర్తి 41.2, కమలాపూర్ 32.6, హసన్‌పర్తి 14.5, ధర్మసాగర్ 12.8, కాజీపేట 10.3, ఐనవోలు 16.3, పరకాల 18.5, దామెర 43, ఆత్మకూరు 44.5, శాయంపేట 35.9, నడికూడ మండలంలో 37.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కాగా, భారీ వర్షాల వల్ల జిల్లాలో పాక్షికంగా డ్యామేజీ జరిగినట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. ప్రాథమిక అంచనా ప్రకారం వరి, మక్కజొన్న కలిపి 20 ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. 40మీటర్ల మేరకు రోడ్డు కోతకు గురికాగా, 15 ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని, మూడు పశువులు మృతి చెందినట్లు చెప్పారు. పరకాల పలు కాలనీల రోడ్లు, ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. చలివాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. దామెర చెరువు మత్తడి దుంకుతున్నది. పంట పొలాల్లోకి భారీగా వర్షపు నీరు చేరింది. ఆత్మకూరు మండలంలోని కటాక్షపురం పెద్ద చెరువు మత్తడి పోస్తుంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే బ్రిడ్జి కోసం నిధులు మంజూరు కాగా, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు ముందుకు సాగడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కటాక్షపురంలో వరి, పత్తి పంటలు నీటి మునిగాయి. ఇప్పలకుంట చెరువు కింద ఉన్న తూములు జంగు పట్టి సక్రమంగా లేకపోవడంతో అందులో నుంచి నీళ్లు బయటకు పోతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. కాల్వలు సక్రమంగా లేకపోవడంతో వరద అంతా పంట పొలాల నుంచి పోవడంతో చెరువును తలపిస్తున్నాయి. దామెర మండలంలోని పులుకుర్తి, పసరగొండ, ల్యాదెళ్ల, కోగిల్వాయి గ్రామాల్లో పత్తిపంటలో నీరు నిల్వగా, వరి పంట నీట మునిగింది. పులుకుర్తి, ఊరుగొండ, పసరగొండ లోలెవెల్ బ్రిడ్జి వద్ద వరద ప్రవాహంతో రెండు గంటల పాటు వాహనాలు నిలిచిపోయాయి. పసరగొండలో రోడ్డు పక్కన ఉన్న పలువురి ఇండ్లల్లోకి వరదనీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భీమదేవరపల్లి మండలంలోని వంగర చెరువు అలుగుపారుతున్నది. నీటి ప్రవాహం అధికం కావడంతో వంగర, భీమదేవరపల్లి రహదారిలో వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వంగర గ్రామస్తులు మంగళపల్లి మీదుగా సిద్దిపేట–హనుమకొండ రహదారికి వెళ్తున్నారు. ముల్కనూరు, వంగర వాగులు ఇప్పటికే పొంగిపొర్లుతున్నాయి. వరుసగా కురుస్తున్న వర్షాలకు పెంకుటిళ్లు నేలకూలుతున్నాయి. శాయంపేట మండలంలోని కొత్తగట్టుసింగారం, శాయంపేట, పత్తిపాక, పెద్దకోడెపాక, కొప్పుల, గట్లకానిపర్తి, సూరంపేట గ్రామాల్లో భారీ వర్షంతో వరి పొలాలు నీట మునిగినట్లు రైతులు చెప్పారు. పత్తితో జాలుపడుదూ గడ్డి పెరిగి దెబ్బతింటున్నట్లు వాపోయారు.


పరకాల: పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

భీమదేవరపల్లి : గట్లనర్సింగాపూర్‌లో వర్షాలకు కూలిన వ్యవసాయబావి

శాయంపేట: కొత్తగట్టుసింగారం శివారులో నీట మునిగిన వరి పొలాలు

ఇద్దరు నాయబ్ తహసీల్దార్లకు ఉద్యోగోన్నతి

హనుమకొండ, సెప్టెంబర్ 4 : మల్టీజోన్ –1, మల్టీజోన్ –2 పరిధిలో కలిపి మొత్తం 76 మంది నాయబ్ తహసీల్దార్లకు ఉద్యోగోన్నతులు కల్పిస్తూ సీసీఎల్‌ఏ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో హనుమకొండ జిల్లా సివిల్ సప్లయ్ శాఖ డీటీ కే సత్యనారాయణ, పరకాల డీటీ కృష్ణ ఉన్నారు. తహసీల్దార్‌గా ఉద్యోగోన్నతి పొందిన కే సత్యనారాయణను హనుమకొండ జిల్లాకు, ఎం కృష్ణను వరంగల్ జిల్లాకు ప్రభుత్వం కేటాయించింది.

ఐదుగురు ఎస్సైల బదిలీ

సుబేదారి, సెప్టెంబర్ 4 : ఐదుగురు ఎస్సైలను బదిలీ చేస్తూ బుధవారం వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. మడికొండలో పనిచేస్తున్న జీ దివ్య వంగర, నర్సంపేటలో పనిచేస్తున్న జీ రాజేశ్‌రెడ్డి చెన్నారావుపేట, ఇక్కడ పనిచేస్తున్న జీ అరుణ్ నర్సంపేట, సీసీఎస్‌లో ఉన్న ఎండీ ఫయాజుద్దీన్ హనుమకొండ, పోస్టింగ్ వెయిటింగ్ ఉన్న ఎండీ యాకూబ్ సీసీఎస్‌కు బదిలీ అయ్యారు.

మున్నూరుకాపు డెవలప్‌మెంట్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నవీన్

తోట నవీన్

హనుమకొండ, సెప్టెంబర్ 4 : తెలంగాణ మున్నూరుకాపు డెవలప్‌మెంట్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నగరంలోని 60వ డివిజన్ వడ్డేపల్లికి చెందిన తోట నవీన్‌ను నియమిస్తూ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల రవికుమార్ ఉత్తర్వులు జారీచేశారు. తనపై నమ్మకంతో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్‌కు నవీన్ కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హనుమకొండ, సెప్టెంబర్ 4 : హనుమకొండ టౌన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ ఆపరేషన్ డీఈ సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బాలసముద్రం సబ్ స్టేషన్ పరిధిలోని సాయినగర్, కంచరకుంట్ల, లష్కర్‌బజార్ మెయిన్‌రోడ్డులో ఉదయం 8 నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

గురుకుల విద్య బలోపేతానికి చర్యలు

పరకాల, సెప్టెంబర్ 4 : గురుకుల విద్య బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మల్లక్కపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలను తనిఖీ చేశారు. భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించారు. ఆయన మాట్లాడుతూ గురుకులాల్లో కార్పొరేట్ స్థాయిలో విద్య, నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆర్డీవో నారాయణ, ప్రిన్సిపాల్ కృష్ణకుమారి పాల్గొన్నారు.

సైబర్ నేరస్తుడి అరెస్ట్

సుబేదారి, సెప్టెంబర్ 4: తక్కువ పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి ప్రజలను మోసం చేసిన సైబర్ నేరస్తుడిని వరంగల్ సైబర్ పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం హనుమకొండలోని పోలీసు కమిషనరేట్‌లో సైబర్ క్రైం ఏసీపీ విజయకుమార్ వివరాలు వెల్లడించారు. చెన్నైకి చెందిన మరియా బెనెడిక్ట్ పెట్టుబడి పేరుతో ఆన్‌లైన్ ద్వారా కోట్ల రూపాయలు వసూలు చేశాడు. హనుమకొండకు చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.33.50లక్షలు వసూలు చేయగా, బాధితుడి ఫిర్యాదుతో విచారణ చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు.

తాగునీరు కలుషితం కాకుండా చూడాలి

వరంగల్, సెప్టెంబర్ 4 : భారీ వర్షాల నేపథ్యంలో తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. బుధవారం కార్పొరేషన్‌లో ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పైప్‌లైన్ల లీకేజీలను అరికట్టాలని సూచించారు. ఎస్ఈలు ప్రవీణ్ చంద్ర, రాజయ్య, ఈఈ మహేందర్, డీఈ శివానంద్, ఏఈ సంతోష్, ఫణికుమార్ పాల్గొన్నారు.

యోగిరెడ్డి, ఆద్యలకు నివాళి

హనుమకొండ, సెప్టెంబర్ 4 : గత నెలలో కూతురితోపాటు ఆత్మహత్యకు పాల్పడ్డ జర్నలిస్టు యోగిరెడ్డి, ఆద్యలకు పలువురు నివాళులర్పించారు. బుధవారం బాలసముద్రంలోని ఏకశిలా పార్కు వద్ద యోగిరెడ్డి మిత్రబృందం, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. మాజీ ఎంపీ సీతారాంనాయక్ పాల్గొన్నారు.

నగరంలో సినిమా షూటింగ్

హనుమకొండ చౌరస్తా: హనుమకొండలోని అంబేద్కర్ జంక్షన్, జోస్‌ఆలుక్కాస్‌లో 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమా షూటింగ్ బుధవారం జరిగింది. హీరో విక్రాంత్, హీరోయిన్ చాందిని చౌదరిపై కొన్ని సీన్లు చిత్రీకరించారు.

మస్టర్లలో కొట్టివేతలు.. అప్‌డేట్ లేని రికార్డులు

- క్షేత్రస్థాయిలో కనిపించని మొక్కలు
- ఉపాధి హామీ ప్రజావేదికలో బహిర్గతం
- రూ.28వేల రికవరికీ డీఆర్డీవో నాగపద్మజ ఆదేశం

వరంగల్ రూరల్ జిల్లాతో ఉన్న ఫ్లెక్సీ

శాయంపేట, సెప్టెంబర్ 4 : మస్టర్లలో కొట్టివేతలు.. రికార్డులు అప్‌డేట్ లేకపోవడం, ప్లాంటేషన్ చేసిన మొక్కలు క్షేత్రస్థాయిలో కనిపించకపోవడం, కూలీలకు పని కల్పించకపోవడం వంటి అనేక లోపాలు ప్రజావేదికలో బహిర్గతమయ్యాయి. శాయంపేట మండల పరిషత్‌లో 15వ విడుత సామాజిక తనిఖీ బృందం ప్రజావేదిక బుధవారం నిర్వహించారు. డీఆర్‌డీవో నాగపద్మజ హాజరయ్యారు. 2023 మార్చి నుంచి 2024 ఏప్రిల్ వరకు మండలంలో ఉపాధి పనులపై నివేదిక ప్రకటించారు. 355 వర్కులకు రూ.3.85కోట్లు, మెటీరియల్ కంపోనెంట్‌గా రూ.9.80లక్షలు ఖర్చు చేశారు. పంచాయతీరాజ్ శాఖలో సీసీ రోడ్లు, జీపీల్లో పనులు, పాఠశాలల్లో టాయిలెట్స్ కింద 57 పనులకు రూ.2.55కోట్లు ఖర్చు చేశారు. అటవీ శాఖలో 8 పనులకు రూ.13.94లక్షలు ఖర్చు చేసినట్లు డీఆర్డీవో వెల్లడించారు. 12 రోజులు పనిచేస్తే 10 రోజులు హాజరు వేయలేదని దాంతో కూలీలకు డబ్బులు అందలేదని సభకు తెలిపారు. రోజ్‌గార్ దివస్ నిర్వహించాల్సిన రిజిష్టర్లు లేకపోవడంపై ఆక్షేపించారు. కొన్ని చోట్ల పనుల ఫొటోలను మార్ఫింగ్ చేసినట్లు బయటపెట్టారు. వసంతాపూర్‌లో మునగ మొక్కలకు సంబంధించి రూ.1.25లక్షలు చెల్లించారని మొక్కలు లేవని డీఆర్‌పీ వెల్లడించారు. దీంతో రికవరీ చేయాలని సూచించారు. 24 పంచాయతీల నివేదిక అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.6వేలు, టెక్నికల్ అసిస్టెంట్లకు రూ.7వేలు, జీపీ కార్యదర్శులకు రూ.15వేలు మొత్తం రూ.28,947లు రికవరీకి ఆదేశించారు. జిల్లా అంబుడ్స్‌మెన్ నాగరాజు, జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్, జిల్లా క్వాలిటీ అధికారి శ్రీనివాస్‌రావు, డీటీసీ శ్రీధర్, డీవీసీ సాగరిక, ఎంపీడీవో ఫణిచంద్ర, ఏపీవో అనీత, ఈసీ రమేశ్ పాల్గొన్నారు. కాగా, ప్రజావేదికలో వరంగల్ రూరల్ జిల్లాతో ఉన్న ఫ్లెక్సీనే పెట్టడం చర్చకు దారితీసింది. శాయంపేట మండలాన్ని హనుమకొండ జిల్లాలో కలిపి ఏడాది దాటుతున్నా ఇంకా వరంగల్ రూరల్ జిల్లా అని ఉన్న పాత ఫ్లెక్సీని వాడడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.